# గారాబం

భట్టిప్రోలు నాగసుందరి సంక్రాంతి కథానికల పోటీలో
సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ.

డా॥ తాడేపల్లి పతంజలి




రాఘవయ్య జ్యోతిని బాగా గారాబం చేస్తున్నాడని భార్య సూర్యకాంతం అభిప్రాయం. మరీ అంత గారాబం చేయకండి. అది పెళ్లి కావాలిసిన పిల్ల.... రేపక్కడ పరిస్థితులెలా ఉంటాయో... అసలు కష్టమనేది తెలియకుండా పెంచితే కష్టం....” సూర్యకాంతం - జ్యోతి ఇంట్లో లేనప్పుడు రాఘవయ్యతో చెప్పింది.

రాఘవయ్య నవ్వి ఊరుకొన్నాడు.

“మొన్నటికి మొన్న ఎగ్జిబిషన్‌కి వెళ్తాం నాన్నా అంటే వేయి రూపాయలు మాట్లాడకుండా ఇచ్చేసారు. అడిగినంత ఇచ్చేయటమేనా?! అంతెందుకమ్మా... అనరు. ఊరికే అది దుబారా చేస్తోంది” సూర్యకాంతం మళ్లీ గొంతు పెంచుతూ అంది.

రాఘవయ్య – సూర్యకాంతం మాటలకు ఏమీ సమాధానం చెప్పకుండా "బంగారం ఎక్కడికి వెళ్ళిందే" అన్నాడు.

జ్యోతికి అతడు పెట్టుకున్న ముద్దుపేరు బంగారం.

"ఏమో నాకేం తెలుసు.... స్వేచ్ఛ ఇచ్చా రుగా... ఎక్కడికి వెళ్ళిందో.... అమ్మా... కాలేజీ నుంచి ఆలస్యంగా వస్తానని మాత్రమే చెప్పింది..." సూర్యకాంతం అక్కసుగా చెప్పింది. భర్త తను చెప్పిన మాటలు పట్టించుకోవడం లేదనే ఉక్రోషంతో సూర్యకాంతం మొగం ఎర్రబడింది.

"సరేలే..... నేనలా బయటకు వెళ్ళొస్తా.... బంగారం ఇంటికి వచ్చిన తర్వాత ఏమనకు.... పిల్ల ఇంటికి రాగానే ముందు తినటానికి ఏమన్నా పెట్టు..." రాఘవయ్య ఉత్తరీయం భుజాన వేసుకొంటూ అన్నాడు.

"మీ బంగారాన్ని నేనేమీ అనను.... మాడ్చను... సరేనా...?" సూర్యకాంతం విసురుగా అంది.

రాఘవయ్య నవ్వుకొంటూ బయటికి నడిచాడు.

✿ ✿ ✿

"చూసారా.... మీ గారాబం వల్ల ఇంటర్ మార్కులు ఎలా వచ్చాయో... వెయ్యికి తొమ్మిది వందలే వచ్చాయి. మనమేమను కొన్నాం... మంచి రాంక్ రావాలని అనుకొన్నామా లేదా!" సూర్య కాంతం రాఘవయ్యకు ఫిర్యాదు చేసింది. రాఘవయ్య స్పందించలేదు.

జ్యోతి తన గదిలో కూర్చుని ఏదో చదువుకొంటోంది.

"తొమ్మిది వందలు వచ్చాయని అభినందించారు కాని, మనమను కొన్నంత రాలేదని ఒక్కమాట అనలేదేమిటండి?!" సూర్యకాంతం ప్రశ్నించింది.

ఇంతలో జ్యోతి తండ్రి దగ్గరకు వచ్చింది.

"ఏమ్మా..." ఆప్యాయంగా అడిగాడు రాఘవయ్య.

"నేను విశ్వభారతి డిగ్రీ కాలేజీలో చేరను నాన్నగారు... ఆదర్శ కాలేజీలో చేరతాను...." జ్యోతి అన్నది.

"అలాగేనమ్మా... ఎక్కడ చదివితే నేను బాగా చదవగలనని నువ్వను కొంటే అక్కడే చదువు." రాఘవయ్య అన్నాడు. "థ్యాంక్స్ డాడీ...." అంటూ జ్యోతి, అమ్మవైపు చూసి నవ్వుతూ తన గదిలోకి వెళ్ళింది.

"ఏంటండీ.... మీరు.... విశ్వభారతి కాలేజీ మనింటికి నాలుగడుగుల దూరంలో ఉంది. అంత దగ్గరి కాలేజీ వదిలిపెట్టి, డొనేషన్ ఎక్కువ ఉండే ఆదర్శలో చేర్పిస్తారా... ఒక్కగానొక్క పిల్లయితే మాత్రం.... దానిష్టం వచ్చినట్టు అన్నీ చేస్తారా.... అది ఆడపిల్ల... మర్చిపోవద్దు..." సూర్యకాతం కస్సుమని లేచింది.

రాఘవయ్య నవ్వుతూ భార్యవైపు చూసాడు. తమ గది తలుపులు దగ్గరగా వేసాడు. భార్య పక్కన ప్రేమగా కూర్చుంటూ "నువ్వు మామూలుగా ఉన్నా, కోపంగా ఉన్నా అందంగా ఉంటావ్" అని లాలనగా అన్నాడు.

"వీటికేం తక్కువ లేదు..." సూర్యకాంతం బింకంగా అంది.

"సూర్యా ! నువ్వు చెబుతున్నది నాణేనికి ఒక పక్కే... మన జ్యోతి ఏది మంచో, ఏదిచెడో తెలిసిన పిల్ల... దానికి స్వేచ్ఛ ఇస్తున్నట్టే చెప్పి, తనకు తెలియకుండా ఒకటికి రెండుసార్లు అది ఏం చేస్తోందో చూసాను. మళ్ళీమళ్ళీ అప్పుడప్పుడు చూస్తూనే ఉంటాను. నేటి కాలపు తండ్రి బిడ్డలకి అడిగిన స్వేచ్ఛ ఇవ్వాలి. వాళ్ళేం చేస్తున్నారో, వాళ్ళకు తెలియకుండా గమనిస్తుండాలి.... అప్పుడే వాళ్ళకు వ్యక్తిత్వం పెరుగుతుంది. అఫ్‌కోర్స్... మన మీద ప్రేమ కూడా..."

రాఘవయ్య మాటలకు సూర్యకాంతం నిండుగా నవ్వింది.

## గులకరాళ్ళ డబ్బా మోగించి....

**చేతి** రెండువేళ్ళమీద
నా యిద్దరు కూతుళ్ళూ
షష్టిపూర్తి అంగుళీయకాలై మెరవడం
ఏడేడు సముద్రాలూ దాటుతూ
చిన్నారి మనవరాలు
నా మెడలో జ్ఞాపకాల గొలుసై తళుకులీనడం
మమతానురాగాలు వొట్టిపోయిన
మట్టి బుర్రలకు అర్ధంకాదు.
మక్కా మసీదులో శాంతి కపోతాలు
జిలెటిన్లకు గుచ్చిన కబాబులైనా
ముదిగొండలో యిండ్లు అడిగినందుకు
గుండెల్లో తుపాకీ గుండ్లు నాటినా
గోకుల్ చాట్‌లో మనుషుల మాంసాన్ని
చాట్ మసాలాతో నంజుకున్నా
లుంబినిలో కేరింతల వినోదం
లిప్తపాటులో విషాదమై నెత్తురోడినా
విభ్రమావరణంలో విహరించే నీ అక్షరాలకు
చీమ కుట్టినట్టైనా వుండదు.
అసలు నీ అక్షరాలకు గాలిలో ఈదడం తప్ప
నేలమీద నడవడం తెలియదు.
నుసిపట్టిన పాత పుస్తకాలు అర్ధం కాకపోవడానికీ
ఆఫ్‌సెట్ ప్రింటింగ్‌లో మాయాబజార్లు సృష్టించి
జనాన్ని కాటు కలపడానికీ
తేడా తెలియని నీ అజ్ఞానానికి
జాలిపడడం తప్ప ఏం చేయగలను ?
ఉవ్వెత్తున ఎగిసిపడే ఆకలి మంటల్ని
కన్నీటితో ఆర్పుకున్న పేదవాడ్ని
చిరుగుల అతుకుల బతుకును
ఏండ్ల తరబడి తొడుక్కున్నవాడ్ని
నేననుభవించిన దుర్భర పేదరికం బతుకు పుస్తకం
నీ వాలు కుర్చీ రాతల ఊహకందనిది.
దోసిళ్ళలో కన్నీళ్ళతో మిగిలిన చిన్నారుల చేతుల్లో
పుస్తకాన్నై సమాశ్వాసించిన వాడ్ని.
చదువు కొనడానికి స్థోమత లేని చిరు దీపాలను
ఫీజుల చమురుతో వెలిగించినవాడ్ని.
జీతాన్నీ, జీవితాన్నీ కుదించుకొని
అనాథాశ్రమ వాటికమీద
స్నేహలతనై అల్లుకున్న వాడ్ని
కన్న బిడ్డల ప్రేమను వేళ్లకు ధరించినందుకే
నన్ను నరికేయాలని గాండ్రించావు
బైక్‌లూ, కార్లూ, మేడలూ, బ్యాంక్ బ్యాలెన్సులూ వున్న
'సమసమాజ సాప్నికులకు ఏం చేస్తావు?
అయినా ధన స్వామ్యం ముసుగులో
ఇంత నిస్సిగ్గుగా దాక్కున్న నీతో
వాదించడానికి మాత్రం
ఇంకా ఏం మిగిలిందని......?

**– దిలావర్**